# మిసెస్ మూర్తి

## ప్రతికంటి కృష్ణారెడ్డి

ఆ గదిలో నేను అడుగు పెట్టాను

అందమైన ఒక మేజా !— ఆ మేజాకు ఒక వైపున కుర్చీలో అరవిరసిన రోజా ! ఆ రోజాపై దృష్టి సారించిన యిద్దరు రాజాలు చెరొకకుర్చీపై కూర్చున్నారు దర్జాగా— మేజా కిరువైపులా మిగిలిన ఒక్క వైపున ఉన్న కుర్చీ నా కోసమేనేమో?— అన్నట్లుగా ఖాళీగా వుంది

మేజాకు ఒక వైపున కుర్చీకి అలంకార ప్రాయంగా కూర్చుని ఆ గదిలో నేను అడుగు పెడుతూనే నా కంటపడి, నవ్వీ నవ్వనట్లుగా నవ్వి నాకు స్వాగతం పలికిన వ్యక్తి ఒక సంపాదకుడు

సంపాదకుడంటే— 'సంపాదించువాడు!'— అన్న విపరీతార్థాన్ని వెలికి తీసి యికిలించె ఈ రోజుల్లో ఆ సంపాదకుడిని ఈ అపవాదులనుండి వెలికి తీయ డానికి ఒక్కటే మార్గం!—

అది పరిభాషాశ్రయం !!

కొంపలకు కొంపల్నే దోచి మనుషుల్ని నిరాశ్రయుల్ని చేయడమే లక్ష్యంగా వున్న ఈ కాలంలో పరభాషాశ్రయానికి పాల్పడడం పద్ధతిగానే కొనసాగుతూ ఉంది

అందుకే ఆ సంపాదకుణ్ణి 'ఎడిటర్' అంటే సరిపోతుంది

ముఖ్యంగా తెలుగువాడికి అట్లా అంటేనే బాగా అర్థమవుతుంది కూడా !— అందుకే అన్నాడేమో ఒక తెలుగుకవి— 'ఎడిటరన్న పదవి ఇంద్ర భోగమ్మురా !' అని

ఆ ఎడిటర్‌గారికి వలపట కూర్చున్నది ఓ ఉద్యోగి దాపట వొదిగి మేజాపై వాలి వున్నది ఒక రోజా !—

జీవితంలో ఎన్నో అనుభవాలు

కొన్ని స్వయంగా అనుభవిస్తాము కొన్ని కండ్లారా చూస్తాము మరికొన్ని చెవులారా వింటాము

స్వయంగా అనుభవించినా, చూచినా, విన్నా అనుభవం మాత్రం అనుభవమే ! అయితే చూచి నటువంటి, విన్నటువంటి అనుభవం మనిషిని కాసేపు ఆలోచింపచేస్తే స్వానుభవం జీవితాన్నే మార్చి వేస్తుంది

భోగి వేమన యోగివేమన కావడానికి కారణం ఈ అనుభవమే !

ఈ అనుభవం నా స్వానుభవం దీని ప్రభావం నాపై ఎట్లా వుంటుందో యిప్పటికిప్పుడే చెప్పడం కష్టం అసలు ఉండవచ్చు ఉండకుండా కూడా




పోవచ్చు కానీ ఆ అనుభవం మాత్రం అనుభవం గానే మిగిలిపోతుందేమో ?

నా ఆలోచనలకు తాళం వేస్తూ ఆ గదిలో పైన పంకా తిరుగుతూ ఉంది ఆ మేజామీద రకరకాల పత్రికలు అడ్డదిడ్డంగా పడి ఉన్నాయి ఆ పత్రికల అట్టలమీది బొమ్మలు కొన్ని నగ్నంగా, కొన్ని అర్ధనగ్నంగా మరికొని భయంకరంగా దృష్టిని ఆకర్షిస్తున్నాయి క్లబ్బుల్లో విలన్ భయానికి భయపడి విప్పేసి ఆడే నాట్యకత్తెల్లా నగ్నచిత్రాలు పంకా గాలికి నాట్యం చేస్తున్నాయి వయ్యారంగా!— ఆ గది మూలల్లో పాత పత్రికల కుప్పలు నిట్టూరుస్తున్నాయి— అనుభవించి వదలిన అబలల్లాగా ఆ ముగ్గురు కుర్చీలపై నిటారుగా కూర్చుని అలసి సొలసిన వీరుల్లాగా సేదతీర్చుకొంటున్నారు వాళ్ళ మాటి బిగింపులు ఉచ్ఛ్వాస నిశ్వాసలు గమనిస్తుంటే అంత వరకు వాళ్ళేదో విషయంపై తర్జన భర్జనలుచేసి నిర్ణయాన్ని అందుకోలేక గమ్యంచేరని ప్రయాణీకుల్లా సత మత మవుతున్నట్లుంది

ఆ పరిస్థితిని అవగాహన చేసుకొందామని ఓ నిముషంసేపు నిలబడినాను మనసు రకరకాలుగా పోతూంది

విన్నగాక మొన్న అనుకోనివిధంగా ఎన్టీఆర్ ప్రభంజనం ఆంధ్రదేశాన్ని ఒక్క ఊపు ఊపింది మేడమీద మేడ, మెడమీద పిడికెడుకండ పెంచుకొంటున్న రాజకీయ(వి)నాయకులమొగాన పేడనీళ్ళు కొట్టింది కేవలం డబ్బులోనో, కుల మత ప్రాతిపదికలమీదనో, వేదికలమీద ఉపన్యాసాలతోనో మసిపూసి మారేడుకాయలు చేయలేమని ఖచ్చితంగా తేల్చింది తెలుగువాడి వేడి అంతర్జాతీయంగా ప్రాకింది

కాంగ్రెస్ నాయకులు కలవరపడిపోతున్నారు 'అయినా రాజకీయమంటే సినిమానటన కాదులే ! ఈ ఊపు ఎన్నాళ్ళు ?'అని ఓపిక పట్టుతున్నారు

తమ తీర్పుకు ఎంతోమార్పును ఎదురుచూస్తున్నారు సామాన్యులు

ఏ నోటవిన్నా, 'రామరాజ్యం' ఎట్లుంటుందో ? చూడాలన్నమాట వినిపిస్తూఉంది బహూశా వాళ్ళు ముగ్గురుకూడా యిందులోనేపడి ఊదులాడుతున్నారేమో ?

'కూర్చోండి !' — ఎడిటర్‌గారి మాటతో నా ఆలోచనల్నిమార్చుకొని కుర్చీలోకూర్చున్నాను అంతలోనే ఆ 'ఉద్యోగి'మిత్రుడు ఏదో సినిమాపేరుచెప్పి, 'ఆ సినిమాను మీరుచూశారా ?' అని అడిగాడు

ఓ ప్రముఖ వ్యాపారసంస్థలో అంతకంటే ప్రముఖుడైన ఉద్యోగి ఆయన. ప్రస్తావించడానికి యింకేమీ విషయమే లేనట్లు దేశ కాల పరిస్థితులన్నిం టికీమించినట్లు ఆయన ఒక సినిమానుగురించి ప్రశ్నించేసరికి నాకు తెలియక నేనా పెదవులమీద నవ్వు పొడసూపింది.

దీనికి కారణం లేక పోలేదు !

ఆ మధ్య ఎవరో ఒక పెద్దమనిషి నేటి చలన చిత్రాల్నిగురించి ప్రస్తావిస్తూ నేటి సినిమాలన్నీ కూలియేడుపులని చమత్కరించినారు.

''కూలి యేడుపులా ?'' అని ఆశ్చర్యంగా అతని వైపే చూస్తూంటే అతడే అన్నాడు.

''బాబూ ! కొందరు చచ్చిపోతే లోకమే యేడుస్తుంది. వాళ్ళని మహాత్ములంటారు. కొందరు చచ్చిపోతే ఊరూ నాడూ యేకమై యేడుస్తాయి. వాళ్ళని గొప్పోళ్ళుఅంటారు. మరికొందరు చచ్చిపోతే యేడుపు బంధువర్గానికే పరిమితమవుతుంది. అట్లాంటివాళ్ళను సామాన్యులంటారు. మరికొందరు చచ్చిపోతే యేడ్చేదానికి కాదుగదా ?— ఎత్తేసేదానికి కూడా దిక్కూదరీ వుండరు. అటువంటి వాళ్ళు దౌర్భాగ్యులు. అట్లాంటి దౌర్భాగ్యులకోసం, చస్తే యేడవడం సంప్రదాయంకాబట్టి కూలిచ్చి యేడిపిస్తారు. వాటినే కూలియేడుపు లంటారు.''

''అయితే నేటి సినిమాలన్ని కూలియేడుపులని మీ అభిప్రాయమా ?'' రెట్టించి అడిగినాను.

''ఆలోచించి చూడు !'' అన్నాడా పాతకాలపు పెద్దమనిషి.

ఎన్నని ఆలోచించడం ?

నిద్రపడకనుండి లేచీ లేవకముందే ఏడుపు మొగంతో ఎదుటనిలబడుతుంది కడగొట్టుఅమ్మాయి 'నాన్నా ! ఈ లెక్క చేసిపెట్టు !'అని. పాతికేండ్ల కిందటనే పాతర పెట్టిన లెక్కల సూత్రాల్ని ఆలోచించలేక ఆ అమ్మాయి ముందు యేడుపు మొగం పెట్టవలసివస్తూ ఉంది.

అంతలోనే శ్రీమతి స్టౌను విసిరికొడుతూ, 'ఈ స్టౌవ్‌లో పోసే కిరసనాయిలు చూడండి. ఎంత మడ్డిగా వుందో ? మండిచస్తే నా చావు నేను చస్తాను !' అని విరుచుకపడుతుంది.

కిరసనాయిలు తెల్లగా వుండకుండా ఎర్రగా

# మిసెస్ మూర్తి

ఎందుకుంటుందో ఆలోచించలేక ఆమెవైపు చూడలేక మొగాన్ని యింకొక పక్కకు తిప్పితే అక్కడప్పుడే ప్రత్యక్షం ! — నా ప్రతిపక్షంవాడు సుపుత్రుడు. 'బెజవాడ బెబ్బులి' సినిమా ఫస్ట్ డే ఫస్ట్ షోనే చూడాలట !

హతవిధీ ! సామాన్యుణ్ణి ఎక్కి తొక్కుతున్నది ఎన్నెన్ని ఆలోచనలు !

''ఏంవిటి ? అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు ?'' ఎడిటర్ అడిగినారు.

''సినిమాల్ని గురించి !''

ఉద్యోగి ఎగిరి గంతేసినంత పనిచేసి 'అయితే సినిమాను చూచినారన్నమాట ! అయితే ఆ సినిమాను గురించి మీ అభిప్రాయాన్ని చెప్పండి !' అని అడిగినాడు.

''అభిప్రాయాన్ని ఒక రచయిత దృష్టిలో చెప్పమంటారా ? లేక నటుడిగా చెప్పమంటారా ? ఈ రెండింటినీ కాదని ఓ విమర్శకుడుగా విమర్శించమంటారా ?'' — అప్పటికి నేనేదో ఒక బహుముఖ ప్రజ్ఞాశాలినైనట్లు అడిగినాను.

''ఏమీ వద్దు. ఓ సాధారణ ప్రేక్షకుడుగా చెబితే చాలు !'' రాతికి టెంకాయ కొట్టినట్లు అన్నాడా ఉద్యోగి మిత్రుడు.

ఆ మాటతో నాలోని అహం దెబ్బతిన్నట్లుంది. బాగా ఊపిరి పీల్చుకొన్నాను. వెంట్రుకవాసి ఉబ్బిన కాయాన్ని కుర్చీ నిండుకు సర్దినాను. ఓ మహత్తరమయిన జీవిత సత్యాన్వేషణలో తలమునకలవుతున్న యోగిపుంగవునిలా ముఖ భంగిమలు మార్చినాను. రెండు మూడు నిముషాలు గంభీరముద్ర వహించినాను.

ముగ్గురు తదేక దృష్టితో నన్ను గమనిస్తున్నారు.

నానుండి ఒక అమూల్యమయిన అభిప్రాయం బయట పడుతుందన్న భావన వాళ్ళ మొగాల్లో కొట్టవచ్చినట్లు కనుపిస్తూ ఉంది.

కాసేపు ఎడమచేతి నడిమివ్రేలితో నడినెత్తిమీద గీరుకొన్నాను. ఆ తరువాత కండ్లు మూసుకొన్నాను. కుడిచేతితో నుదిటిని పొదివిపట్టుకొన్నాను. అటు తర్వాత 'సినిమాకేం ? బాగా ఉంది !' అన్నాను కొండంత రాగం తీసి తుమ్మెదల పాట పాడినట్లుగా!

వాళ్ళ నవ్వులతో ఆ గది నిండిపోయింది !

''నాకు తెలుసు మీరీ మాటతో నవ్వుతారని. కానీ సామాన్య ప్రేక్షకుడి నడిగితే, వాడు 'బాగుంది !' 'బాగాలేదు !' అని మాత్రమే సమాధానం చెప్పగలుగుతాడు. అంతకంటే ఎక్కువగా మీ రతనినుండి ఆశించడం తప్పు. ఆశించి ఆశాభంగం పొంది యిట్లా నవ్వడం అంతకంటే తప్పు !''

వాళ్ళ నవ్వుల్ని సహించలేక సమాధానం కాస్త కటువుగానే చెప్పినాను.

''అదిగాదండీ ! ముగింపును గురించి మీ అభిప్రాయం ?'' ఆమె అడుగుతూ ఉంది సన్నగా నవ్వుతూ !

అప్పుడు ఆమె వైపు గమనించి చూచినాను.

అందమయిన కండ్లను అరచేతంత సులోచనాలు దాచుకొంటున్నాయి. ఒంటిమీది వంపుల్ని కొంటె చూపులనుంచి పైట కాపాడుతూ ఉంది. నాగరికత అంచుల్లో చేరి నవ్వుతున్న సంప్రదాయంలాగా నుదుటి పాపటమీద చేరి కుంకుమ ప్రకాశిస్తూ ఉంది. ఆమె నోరు తెరిచి అడిగితే— నేనే కాదు, ఎవ్వరైనా సమాధానం చెప్పి తీరాల్సిందే! అందుకే—

''ముగింపు నాకు నచ్చలేదండీ !'' అన్నాను.

''ఎందుకూ ?'' ఉద్యోగి ఆవేశంగా జొరబడినాడు.

''ఆ ముగింపుకోసం కథను అంత దూరం లాగవలసిన అవసరం లేదు కాబట్టి !''


''బాగా చెప్పినారు.'' కలగచేసికొనిందా మహిళ.


ఆ మద్దత్తు నాకు చాలా ఆనందదాయంగా ఉంది.

''ముగింపు కేంవయింది?'' ఉద్యోగి తన సందేహాన్ని వెలిబుచ్చినాడు. నేనందుకొన్నాను. ఆమె మాత్రం మమ్మల్ని గమనిస్తూ కుర్చీలో వయ్యారుగా మిఠాయి పొట్లంలా కూర్చొనింది.

''ఆ ముగింపుకి ఏమీ కాదు. లేదంటే— నారీ లోకం మాత్రం కారి ఉమ్ముతుంది.''

''ఎందుకూ ?''



# కడగండ్ల పాలైన గజరాజు !

ఆసియా క్రీడోత్సవాల సందర్భంగా విన్యాసాల కోసం కేరళ నించి ఢిల్లీ వచ్చిన 45 ఏళ్ల గజరాజు కుట్టికృష్ణన్ దాదాపు నాలుగు నెలల తర్వాత దీనాతిదీనమైన పరిస్థితిలో తిరుగు ప్రయాణానికి సిద్ధమైంది దానిని ఓ ట్రక్కులో ఎక్కించి ఎటూ కదలడానికి వీలులేకుండా గట్టి వెదురుబొదులతో దడి కట్టినట్లు కట్టారు కాళ్ళకి బలమైన ఇనుప గొలుసులు బిగించారు శరీరాన్ని లావుపాటి మోకులతో బంధించారు జబ్బు పడి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆ మూగజీవి ఇటువంటి సంకట స్థితిలో మూడువేల కిలో మీటర్ల దూరాన్ని ఎనిమిది పగళ్ళూ, ఎనిమిది రాత్రులూ ప్రయాణం చేయాల్సి ఉంటుంది ఈ బాధ భరించ లేని కుట్టికృష్ణన్ బయలు దేరిన కొద్దిసేపటికే ఆర్తనాదాల అరుపులూ, ఘీంకారాలూ మొదలు పెట్టేసరికి ఆ ట్రక్కుని అఖిల భారత వైద్య సంస్థ ముందు తప్పనిసరిగా ఆపాల్సి వచ్చింది దాన్ని బంధించిన తీరే దాని బాధకి కారణం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎర్రని ఎండలో అలా కదలటానికి వీలు పడని స్థితిలో కూడా తాపాన్ని చల్లార్చుకోవాలన్న తపనతో అక్కడ ఉన్న ఓ చిన్న తొట్టిలోని నీటిని తొండంతో పీల్చి తన శరీరం మీద చల్లుకోవాలని విఫల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నది

చివరికి చీకటి పడే వేళ అవుతూండనగా దానికి బాధ తెలియనంతగా మత్తు మందులు పెట్టి దాన్ని అక్కడ నుంచి బయలుదేర తీశారు కొండలు తక్కువగా ఉంటాయని ఈ గజరాజు ప్రయాణించే మార్గాన్ని జైపూర్ మీదుగా గుజరాత్,మహారాష్ట్రల గుండా ట్రిచూర్ చేరేలా మార్చారు

అయితే కుట్టికృష్ణన్ తో పాటు ప్రయాణంలో పశు వైద్యుడు ఉండడు వైద్యుని సహాయం లేకుండానే అది అంతదూరం ప్రయాణం చేయాల్సి ఉంటుంది కనీసం అటూ యిటూ కదిలే అవకాశం కూడా లేకుండా కట్టివేయబడిన ఆ స్థితిలో ఈ సుదూర ప్రయాణంలో కలిగే విపరీతమైన శ్రమకి అది తట్టుకోలేక పోవచ్చు కూడా !

ఆసియా క్రీడలు అయిపోగానే కుట్టికృష్ణన్‌తో పాటు వచ్చిన మిగతా 36 ఏనుగులూ తిరిగి వెళ్లి పోయాయి కానీ ఆ సమయంలోనే కుట్టికృష్ణన్‌కి 'విరహ వేదన' ప్రారంభం అయింది దానికి జతని కూర్చడానికి బదులుగా డాక్టర్లు మత్తు మందులు వాడటం పెట్టారు గట్టిగా గొలుసులతో బంధించారు నెలల తరబడి అలా ఉండటంతో కాళ్ల చీల మండల చుట్టూ చర్మం కోసుకుపోయి లోతుగా తినేసినట్లయిపోయింది శరీరం కృశించి పోయింది అనారోగ్యంపాలు అయింది వీటివల్ల విసిగిపోయి ఉన్న దాని మావటి మాత్రం ఎలాగో అలా



కుట్టికృష్ణన్ ఈ ప్రయాణాన్ని తట్టుకుని ఇంటికి చేరితే తొందరలోనే మళ్లీ పూర్తిగా కోలు కుంటుందన్న ఆశాభావంతో ఉన్నాడు

కుట్టికృష్ణన్ క్షేమంగా ఇంటికి చేరాలని ఆ రోజు ఉదయం డీర్ పార్క్‌లో ప్రార్థనలు చేశారు ఆ క్రితం సాయంత్రం ఆర్ కె పురంలో ఉన్న అయ్యప్ప గుడిలో భజనలు చేశారు బయలుదేరే ముందు ఎన్ సి సి విద్యార్థులు కుట్టికృష్ణన్‌కి పూలమాలలు వేసి నుదుట బొట్టు గుర్తు పెట్టి లడ్డూలు పంచి పెట్టారు కానీ వాళ్ల ఆనందం ఆట్టేసేపు నిలవలేదు ! ★

"ఎందుకంటే?— ఏ స్త్రీ కూడా తన భర్త మరొక స్త్రీతో కలిసి వుండడం సహించదు కాబట్టి!"

"మీ మాట నేను కాదనను కానీ కథానాయిక సాధారణమైన స్త్రీ గాదు ఆమె చదువుకొన్నది సంస్కారం కలిగింది పైగా ఒక రచయిత్రి అట్లాంటప్పుడు అందరిలాగా ఆమె కూడా భర్త అభిరుచుల్నీ, అభిప్రాయాల్నీ గౌరవించకుండా — అతని క్షణికోద్రేకానికి ఆహుతి అయిన ఒక అబలను చేరదీస్తానంటే కాదని ఆమె ప్రాణాల్నే బలిగొనడానికే దోహదం చేయడం స్త్రీ జాతికే కళంకమంటాను"

ఆమె ముఖం రంగులు మారుతూ ఉంది అసలు సిసలైన అపరంజిలో కాస్త ఎక్కువ మోతాదులో రాగి కలిసినట్లు తయారయింది

"మహాత్మా! స్త్రీ స్వాతంత్ర్యము, స్త్రీ స్వాతంత్ర్యము అని గొంతెత్తి నినదిస్తూనే, నేటి సాహిత్యము కానీ చలన చిత్రాలు కానీ స్త్రీని మళ్ళీ సంప్రదాయానికే కట్టబెట్టడానికి యత్నిస్తున్నారు ఆమెను 'సెక్స్'కే పరిమితంచేసి గుణగణాల్ని లెక్కకడుతున్నారు అంతకంటే సార్థకత లేదా ఆడజన్మానికి ?"

"లేదని నేననడం లేదు భర్తవలన జరిగిన పాటును భార్య సర్దుకుపోయే తత్త్వం కలిగిందిగా ఉండాలను తద్వారా తనలాంటి మరొక ఆడజన్మకు అన్యాయం జరగదు కాబట్టి !"

"ఇంతకూ మీరనేదేమిటి ?" రెట్టించిందామె ఉద్యోగి వైపు !

"ప్రపంచమే ఆమెలో పుట్టింది కాబట్టి—

## మిసెస్ మూర్తి

ఆమె సహనమూర్తి కావాలంటాను"

"అంటే ఒక మగవాడు యిద్దరు ముగ్గురు స్త్రీలతో జీవితం గడపవచ్చు ననేకదా మీ అభిప్రాయం ?"

అప్పుడు చూడాలి ఆమె మొగాన్ని !— కలకత్తా కాళీమాతలా, బెజవాడ కనకదుర్గలా జ్వలిస్తూ ఉంది

"ఈ సత్యాన్ని మన పురాణాలు చాటుతున్నాయి ఇతర మతాలు కొన్ని ప్రోత్సహిస్తున్నాయి కూడా !"

అప్పుడు నేను కేవలం శ్రోతగానేమిగిలినాను

"తప్పుచేసేది మగవాడు ఆ తప్పును జీవితాంతం సహించవలసింది ఆడది అదేతప్పు ఆడది చేస్తే — ఆమె పతిత, కులట, వేశ్య — ఎన్ని బిరుదులు ? ఎన్నెన్నిసత్కారాలు ?— వీటన్నింటిని చిరునవ్వుతో సహించగలశక్తి ఆడదానికిఉండాలి అందుకే మీకా సినిమాముగింపు నచ్చింది అదే నేనైతేనా"

ఆమె మొగం కోపంతో కొంకర్లుతిరుగుతూ ఉంది అయినా నేను కలుగచేసుకొన్నాను

"అదే మీరైతేనా ? పూర్తిచేయలేదే !"

"క్షణికోద్రేకమనేది ప్రతివ్యక్తిలో ఉంటుంది ఏ క్షణికోద్రేకంలో అతడాతప్పు చేసినాడో అదే క్షణికోద్రేకంలో నేనతన్ని నిలువునా కాల్చిచంపుదును"

ఆమె తీరు చూస్తుంటే అంతపని చెయ్యకలిగిన ఆడదిగానే కనుపిస్తూఉంది అయినా ఉండబట్టక అడిగినాను

"ఈలాంటిపరిస్థితి మీకే ఎదురయితే మీరాపని చేయగలరా ?"

"ముమ్మాటికీ, కావాలంటే రాసిస్తాను !"

ఆమెను గమనిస్తున్నాను ఆమె కేవలం వాదం కోసం వాదించడంలేదని తెలుస్తూఉంది మనస్సు ఆమె పరిచయాన్ని కోరుతూఉంది అందుకే అడిగినాను—

"ఇంతకూ తమ పేరేంటి ?"

"మిసెస్ మూర్తి !"— అంటూ ఒక్కఊపులో పైకిలేచి విస విస వెళ్ళిపోయింది !

ఉద్యోగి విరగబడి నవ్వుతున్నాడు

"ఎందుకలా నవ్వుతున్నారు ?"

"తన పేరు చెప్పుకోవడానికికూడా పురుషుని మీద ఆధారపడిన ఆ హైందవ స్త్రీమూర్తిని తలచుకొని !"— వెక్కిరింపుగాఅంటున్నాడు ఉద్యోగి

అంతవరకు తన చూపుల్నిమాత్రం మా ముగ్గురిమీద కేంద్రీకరించి, 'రివాల్వింగ్ చేర్'తో తన శరీరాన్నిమాత్రం అటు యిటూ తిప్పుతూ ఈ సభలో శ్రోతగామిగిలిన'ఎడిటర్' ఉన్నట్లుండి పకపకా నవ్వుతున్నాడు అతని నవ్వుకూడా అర్థం తెలుసుకొందామని ఆతురతగా అడిగినాను— 'ఎందుకండీ అట్లా నవ్వుతున్నారని ?'

ఎడిటర్‌గారు నవ్వుతూనే—

"ఆమె మూర్తిగారి రెండవ భార్యండీ !" అన్నారు

ఉద్యోగినవ్వులతో గది మారుమోగింది

నా తల నాకు తెలియకనే వాలిపోయింది ! ★